క్లుప్తంగా

తపాలా బీమా తీసుకోండి



ఎస్పీని కలిసిన తపాలా అధికారులు

చిత్తూరు కార్పొరేషన్: తపాలా బీమా పాలసీలు తీసుకోవాలని ఆ శాఖ అధికారులు సోమవారం జిల్లా ఎస్పీ మణికంఠ చందోలును కలిశారు. ఎస్పీ కార్యాలయంలో ఆయన్ను కలిసి పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీ గురించి తెలియజేశారు. మొదట ఆయనకు తపాలాశాఖలో ఉద్యోగం వచ్చిందని తర్వాత సివిల్స్ రాసి పోలీసు డిపార్ట్‌మెంట్‌కు వచ్చారని ఉద్యోగులు నెమరువేసుకున్నారు. పోలీసుశాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ చేసుకునే విధంగా చూడాలన్నారు. తక్కువ ప్రీమియంతో ఎక్కువ బోనస్ ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో చిత్తూరు సహాయ పోస్ట్‌మాస్టర్ భాస్కర్, ఇన్సూరెన్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పురుషోత్తం, ఇన్‌స్పెక్టర్ రూపేష్, పోస్ట్‌మన్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ప్రయాణికుల సమస్యల పరిష్కారం నిమిత్తం చిత్తూరు నగరంలోని ఆర్టీసీ వన్‌డిపో కార్యాలయంలో మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డీఎం కృష్ణమూర్తి తెలిపారు. ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. డిపో పరిధిలోని బంగారుపాళ్యం, తవణంపల్లె, ఐరాల, యాదమరి, చిత్తూరు రూరల్ మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి



అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్ సుధాకర్

తవణంపల్లె: మండలంలో భూ సమస్యలు తమ దృష్టికి వస్తే పరిశీలించి పరిష్కరిస్తానని తహసీల్దార్ సుధాకర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా సోమవారం మండలంలోని మత్యంకు చెందిన ఓ రైతు, తెల్లగుండ్లపల్లెకు చెందిన రైతు తమ భూమిని సర్వే చేసి కొలతలు వేసి సరిహద్దులు చూపాలని విజ్ఞప్తి చేశారు. పలువురు రైతులు భూ సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారవేదికలో వచ్చిన అర్జీలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. రెవెన్యూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామన్నారు.

అంగన్‌వాడీ పోస్టుకు దరఖాస్తు ఆహ్వానం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగర పరిధిలోని కుర్రపల్లి మినీ అంగన్‌వాడీ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ శ్యామ్ సుగుణకుమారి తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి ఈనెల 13వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 22వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు కొంగారెడ్డిపల్లి ఐటీఐ సమీపంలోని చిత్తూరు రూరల్ ప్రాజెక్టు కార్యాలయంలో సమర్పించాలని ఆమె పేర్కొన్నారు.

కంటి వైద్యశిబిరానికి స్పందన



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

బంగారుపాళెం: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని నిర్వాహకుడు మురళీకృష్ణ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరానికి విచ్చేసిన 60 మంది కంటి జబ్బు రోగులకు పరీక్షలు నిర్వహించారు. అందులో 37 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించినట్లు తెలిపారు. ఎంపికైన వారిని చెన్నైకి తరలించి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించి, మందులు, కంటి అద్దాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

రక్తదానం ప్రాణదానమే



రక్తదానం చేస్తున్న కళాశాల విద్యార్థినులు

చిత్తూరు కలెక్టరేట్: రక్తదానం ప్రాణదానంతో సమానమని సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మనోహర్ అన్నారు. ఆ కళాశాలలో సోమవారం ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ యువత రక్తదానం చేయడంలో ముందుండాలన్నారు. రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందన్న అపోహలను నమ్మకూడదని చెప్పారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ షమ్స్ అక్తర్ మాట్లాడుతూ తమ కళాశాలలోని 25 మంది బాలికలు రక్తదానం చేయడం అభినందించదగ్గ విషయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సంస్థ అధ్యక్షులు సహదేవనాయుడు, డాక్టర్ విజయకుమార్, వైస్ ప్రిన్సిపల్ నరేంద్ర, రెడ్ క్రాస్ కో–ఆర్డినేటర్ వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

బంతికి ఇదే అదును!



ఇప్పటికే సాగులో ఉన్న బంతి పూల పంట

- మెట్ట నేలలు అనుకూలం
- తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి
- ఇప్పుడు సాగు చేస్తే గిట్టుబాటు ధరలు

ఐరాల: పెరటిసాగుతో పాటు ఉద్యానవన పంటల్లో భాగంగా బంతితోటల సాగుకు ప్రస్తుత వర్షాకాల సీజన్ అనుకూలమని ఉద్యానవన శాఖాధికారులు చెబుతున్నారు. ప్రధానంగా బంతిపూల సాగుకు ప్రస్తుత సీజన్ అనుకూలంగా ఉంటుందని హార్టికల్చర్ అధికారి సాగరిక తెలిపారు. ఆమె వెల్లడించిన



పాతపాళ్యంలో సాగులో ఉన్న బంతి తోట

వివరాల మేరకు, ముఖ్యంగా బంతి తోటల పెంపకానికి నీరు త్వరగా ఇంకిపోయే స్వభావం ఉన్న అన్ని రకాల నేలలు అనుకూలంగా ఉంటాయి. ఈ సీజన్‌లో మండలంలో కొన్ని గ్రామాల్లో బంతి సాగువైపు మొగ్గు చూపుతున్నారు. మహిళలు పెరటి సాగు విధానంలో భాగంగా బంతి తోట సాగు చేసి ఆర్థికంగా లాభపడవచ్చు. ఈ తరహా రైతులను ప్రోత్సహించేందుకు లూజ్ ఫ్లవర్ కల్టివేషన్ పేరిట ఐదు ఎకరాల్లోపు ఉన్న వారికి రూ.16 వేలు, ఐదు ఎకరాలు పైబడి ఉన్న వారికి రూ.10 వేలను ప్రభుత్వం అందించనుంది.

విత్తే పద్ధతి

ఎకరానికి సరిపడా నారు పెంచడానికి 800 నుంచి 1000 గ్రాముల విత్తనాలు అవసరం అవుతాయి. విత్తనాలను ఎత్తయిన మడులు తయారు చేసి విత్తుకోవాలి. మడులు తయారు చేసే సమయంలో ఒక చదరపు మీటరుకు బాగా చివికిన పశువుల ఎరువు 8 నుంచి 10 కిలోలు వేయాలి. విత్తడానికి మొదలు ఫాలిడాల్ పొడి, ఫ్లోరోపైరిఫాస్ చల్లితే చీమలు, చెద నుంచి రక్షణ పొందవచ్చు. సాధారణంగా 5 నుంచి 7 రోజుల్లో విత్తనాలు మొలకెత్తుతాయి. వర్షాకాలం, శీతాకాలం, వేసవి పంటగా కూడా బంతి మంచి దిగుబడులు అందిస్తాయి. నెల వయసు లేదా 3 నుంచి 4 ఆకులు గల మొక్కలు నాటడానికి అనుకూలంగా ఉంటాయి. నారు సాయంత్రం వేళల్లో నాటితే బాగా పాతుకుపోతాయి. 30-40 సెంటీమీటర్ల దూరంలో ఆఫ్రికన్ బంతి, ఫ్రెంచ్ బంతి మొక్కలను 20- 20 సెంటీమీటర్ల దూరంలో నాటుకోవాలి. దీని వల్ల పూల దిగుబడి అధికంగా ఉంటుంది.

యాజమాన్య పద్ధతులు అవసరం

చివరి దుక్కులు దున్నేటప్పుడు ఎకరానికి 20 టన్నుల చొప్పున చివికిన పశువుల ఎరువు వేసి దున్నడం వల్ల భూసారం పెరుగుతుంది. దీంతో పాటు 20 నుంచి 40 కిలోల నత్రజని, 80 కిలోల భాస్వరం, 80 కిలోల పొటాష్ వంటి ఎరువులు వేయాలి. నాటిన 37 రోజుల తర్వాత 20 నుంచి 40 కిలోల నత్రజని వేసి పైపాటుగా నీటి తడులు అందించాలి. 55- 60 రోజుల కాలంలో పూత దశలో నేలలో తగినంత తేమ ఉండేలా చూడాలి. ప్రతి దశలో మొక్కకు నీటిఎద్దడి లేకుండా చూడడం వల్ల లాభాలు అధికంగా ఉంటాయి. బంతి పువ్వు బాగా విచ్చుకున్న తర్వాత కోయడం మంచిది. అది కూడా ఉదయం గానీ సాయంత్రం గానీ కోయాలి. కోసే ముందు నీటి తడులు ఇవ్వడం వల్ల పువ్వు తాజాదనం తగ్గిపోకుండా ఎక్కువ కాలం ఉంటుంది.

చీడీ పీడల నివారణ

పెద్ద, పిల్ల పురుగులు మొగ్గలను ఆశించి నష్ట పరుస్తాయి. వీటి నివారణకు లీటరు నీటికి మోనోక్రోటోఫాస్ 1.5 మిల్లీలీటర్లు లేదా మలాథియన్ 2 ఎంఎల్, లేదా డైమిథోయేట్ 2 ఎంఎల్ కలిపి 15 రోజుల వ్యవధిలో సరిపడా పిచికారీ చేయాలి. అలాగే తామర పురుగులు పిల్ల, తల్లి పురుగులు ఆకులు, పువ్వుల నుంచి రసాన్ని పీల్చివేస్తాయి. దీని వల్ల ఆకులపై తెల్లని మచ్చలేర్పడతాయి. వీటి నివారణకు మోనోక్రోటోఫాస్ 1.5 ఎం.ఎల్ లేదా డైమిథోయేట్ 2 ఎంఎల్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. కీటకాల గుడ్ల నుంచి వెలువడిన చిన్న లార్వాలు మొగ్గ తొలిచే పురుగులుగా ఏర్పడి ఇవి పువ్వు భాగాన్ని తింటాయి. దీని నివారణకు కార్బియల్ 3 గ్రాములను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

జాగ్రత్తలు పాటించాలి



బంతి పంటను రక్షించుకోవడానికి తగు జాగ్రత్తలు పాటించాలి. నేలలో నీటి తడి ఎక్కువగా ఉన్నా, వెచ్చని వాతావరణంలో తెగుళ్లు వ్యాపిస్తాయి. దీని వల్ల మొలకెత్తుతున్న లేతమొక్కలు చనిపోతాయి. వీటి నివారణకు మడులను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు లీటర్ నీటిలో రెండు గ్రాముల కాప్టాన్ లేదా గ్రాము కార్బండిజమ్ లేదా మూడు గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ కలిపి పిచికారీ చేయాలి. తేమతో కూడిన వెచ్చని వాతావరణంలో ఆకుమచ్చ తెగులు ఆశించే ప్రమాదం ఉంది. దీని నివారణకు లీటర్ నీటిలో 2.5 గ్రాముల మాంకోజెబ్ కలిపి పిచికారీ చేయాలి. తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు ఆర్జించే బంతి సాగుకు ప్రస్తుత సీజన్ అనువైనది.

–సాగరిక, ఉద్యానవన శాఖాధికారి, ఐరాల

మౌలానా అబుల్ కలాం ఆదర్శప్రాయుడు



విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆదర్శప్రాయుడని అయన చేసిన సంస్కరణలు నేటికీ అమలవుతున్నాయని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డి తెలిపారు. మైనారిటీల సంక్షేమ దినోత్సవం సందర్భంగా సోమవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో మౌలానా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా సేవలను కొనియాడారు. దివంగత సీఎం వైఎస్సార్ ముస్లింలకు ప్రాధాన్యత ఇస్తూ 4 శాతం రిజర్వేషన్ కల్పించారని గుర్తుచేశారు. ముస్లిం సంక్షేమానికి జగనన్న పెద్దపీట వేశారని పేర్కొనఆనరు. పిల్లలందరూ ఉత్సాహంగా వచ్చి కార్యక్రమంలో పాల్గొనడం ఆనందకరమన్నారు. అనంతరం వారికి నోట్‌పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యులు ఆను, మైనార్టీ నాయకులు చాన్, ముజీబ్, రహంతుల్లా, అల్తాఫ్, జైను, మస్తాన్, ఇమ్రాన్, అక్రమ్, ఖాదర్, ఆరిఫ్, హమీద్, కౌసర్, సయ్యద్, నౌషద్, నవాజ్, గౌస్ పాల్గొన్నారు.

వక్ఫ్‌భూముల ఆక్రమణకు యత్నం

మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ముస్లింలను దగా చేస్తోందన్నారు. నగరంలో వక్ఫ్‌భూములను కబ్జా చేయాలని టీడీపీ నాయకుడు యత్నించినట్లు గుర్తుచేశారు. తనపై అనువుగాని విమర్శలు మానుకోవాలని, రాజకీయాలు చేయడానికి ఇంక సమయం ఉందని టీడీపీ నాయకులను హెచ్చరించారు. ప్రజలకు సేవ చేస్తే స్వాగతించి సహకారం అందిస్తామన్నారు. అభివృద్ధి, సంక్షేమం పేరిట సూపర్‌సిక్స్ హామీలు ఇచ్చిన వారు వాటిని అమలు చేయాలన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసగిస్తే ప్రజల పక్షాన నిలబడి నిరంతరం పోరాటలు చేస్తామని స్పష్టం చేశారు.

నేడు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమావేశం

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద ఆ పార్టీ నియోజకవర్గ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నారు. దీనికి ముఖ్య అతిథిగా చిత్తూరు, తిరుపతి జిల్లాల పార్టీ అధ్యక్షుడు కరుణకరరెడ్డి వస్తారని చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డి సోమవారం తెలిపారు. ఉదయం 9.30 గంటలకు కార్యక్రమం ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. చిత్తూరు నగరం, గుడిపాల, రూరల్ నాయకులతో సమావేశం నిర్వహించనున్నామన్నారు. పలు అంశాలపై నాయకులతో చర్చ ఉంటుందన్నారు. కావున నియోజకవర్గంలోని పార్టీ నాయకులు కార్యక్రమానికి రావాలని వివరించారు.

పౌష్టికాహారంతో వ్యాధులు దూరం



వృద్ధురాలిని పరీక్షిస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఐరాల: ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా వ్యాధులు దూరం చేయవచ్చని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని పాలకల రెడ్డివారిపల్లె, కుమ్మరపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 90 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఉచిత వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు.కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

తవణంపల్లె: గర్భవతులు ఆరోగ్యంగా ఉండాలని వైద్యాధికారి వినయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని గోవిందరెడ్డిపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ వినయ్ కుమార్ 35 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. సీహెచ్‌ఓ రాజామణి, ఆరోగ్య పర్యవేక్షకులు రాజశేఖర్, హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం


బంగారుపాళెం: స్థానిక పీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వందనా త్రిపాఠి సోమవారం ఓ ప్రకటకలో తెలిపారు. కళాశాలలో మ్యాథ్స్ జూనియర్ లెక్చరర్ గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెస్సీ మ్యాథ్స్‌లో 55 శాతం మార్కులు కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 14వ తేదీ కళాశాల ఆవరణలో ఉదయం 10.30 గంటలకు నిర్వహించే ఇంటర్‌వ్యూలకు హాజరు కావాలని కోరారు.

గ్రామాల్లోనే వైద్య సేవలు



గుడిపాల: వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ అనూష అన్నారు. 197రామాపురంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లోనే ఉచితంగా వైద్యసేవలను అందించనున్నట్లు చెప్పారు. అనంతరం షుగర్, బీపీ రోగులకు రక్తపరీక్షలు నిర్వహించి నెలకు సరిపడే మాత్రలను వారికి ఉచితంగా అందజేశారు. మంచానికే పరిమితమైన రోగులకు ఇంటివద్దే వెళ్లి వైద్యం అందించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది దివ్య, సరస్వతి, శశి, అశ్విని పాల్గొన్నారు.

కర్తవ్యం భగవత్ స్వరూపం



ప్రసంగిస్తున్న రాధా మనోహర్ దాస్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కర్తవ్యం భగవత్ స్వరూపమని రాధా మనోహర్ దాస్ అన్నారు. చిత్తూరు నగరంలోని నాగయ్య కళాక్షేత్రంలో సోమవారం చిత్తూరు శ్రీనారాయణి సేవా సమితి ఆధ్వర్యంలో భగవత్ వైభవంపై ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మనుషులు ప్రయత్నించకుండానే దేవుడిపై భారం వేసి సమయాన్ని వృథా చేస్తున్నారన్నారు. చేయాల్సిన పనులు పూర్తి చేయాలంటే మన వంతు ప్రయత్నం ఉండాలన్నారు. అప్పుడే ఆ భగవంతుని తోడు ఉంటుందన్నారు. ముఖ్యంగా భయం భక్తితో సన్మార్గంలో నడవాలన్నారు. భగవంతుని వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి



మౌలానా సయ్యద్ సేవలను విద్యార్థులకు వివరిస్తున్న అధ్యాపకులు

బంగారుపాళెం: విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని పీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వందనా త్రిపాఠి అన్నారు. కళాశాలలో సోమవారం జాతీయ విద్యా దినోత్సవాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. స్వతంత్ర భారత మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా సయ్యద్ అబుల్ కలాం గులాం మొహియుద్దీన్ చిత్ర పటానికి పూజలు చేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, స్వతంత్రానంతరం మౌలానా సయ్యద్ కలాం విద్యాభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ మురళి మాట్లాడుతూ, దేశంలో విద్యావ్యవస్థ పటిష్టతకు, విశ్వవిద్యాలయ స్థాపనకు కృషి చేసిన మహోన్నత వ్యక్తి మౌలానా అని అన్నారు. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి సమాజంలో ఉత్తమ పౌరులుగా ఎదగాలని సూచించారు. ప్రభుత్వ కళాశాలల్లో అందిస్తున్న ఉచిత విద్య, వసతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

వరసిద్ధుని సేవలో చిరంజీవి కుమార్తె



స్వామి ప్రసాదం స్వీకరిస్తున్న సుస్మిత

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామిని సోమవారం సినీనటుడు చిరంజీవి కుమార్తె సుస్మిత దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు దగ్గరుండి దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం వేద ఆశీర్వచన మండపంలో పండితులు ఆమెకు ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది కోదండపాణి, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు



బహుమతులు అందజేస్తున్న అధ్యాపకులు

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని కన్నన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు నివాళి అర్పించారు. విద్యా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. బాల్యదశలో మౌలానాకు విద్యపై ఉన్న ఆసక్తిని స్ఫూర్తిగా తీసుకుని విద్యను అభ్యసించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు మురళీకృష్ణ, రియాజ్‌బాషా, నాగవల్లి, పాజిలా తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ గ్రీవెన్స్‌పై నిర్లక్ష్యం వద్దు



ఫిర్యాదులు తీసుకుంటున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి అందే వినతులపై నిర్లక్ష్యంగా ఉండొద్దని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజల నుంచి అందే ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో విచారించి త్వరగా పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు. ఆర్థిక అంశాలతో ముడిపడ్డ వాటిని ప్రాధాన్యత ఆధారంగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ ప్రసాద్, మునిసిపల్ ఇంజనీరు వెంకటరామిరెడ్డి, ఏసీపీ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు లైసెన్సులు కలిగి ఉండాలి

బంగారుపాళెం: ఆటోడ్రైవర్లు తప్పని సరిగా లైసెన్సులు కలిగి ఉండాలని సీఐ శ్రీనివాసులు అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం సాయంత్రం ఆటో డ్రైవర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఆటోలకు బీమాతో పాటు ఫిట్‌నెస్ కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా యూనిఫామ్ ధరించాలని సూచించారు. పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా నడుచుకోవాలని తెలిపారు. డ్రైవర్లు రహదారి నిబంధనలను ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ మల్లప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

మా మొర ఆలకించండి సారూ

మా మొర ఆలకించండి సారూ... అంటూ పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు వాపోయారు. తమ సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీకి బాధితులు అర్జీలను అందజేశారు. కలెక్టర్ అర్జీలను స్వీకరించి పరిష్కరిస్తామన్నారు.

–చిత్తూరు కలెక్టరేట్

నాకు ఎవ్వరూ లేరు



నా బాగోగులు చూసేందుకు ఎవ్వరూ లేరు. ప్రస్తుతం నాకు వయస్సు 63 ఏళ్లు. వృద్ధాప్య పింఛన్ కోసం చాలా సార్లు కార్యాలయాల చుట్టూ తిరిగాను. ఎవరూ నా బాధ పట్టించుకోలేదు. ఈ వయసులో నన్ను చూసుకునేందుకు ఎవరూ లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నాను. అధికారులు పరిశీలించి వృద్ధాప్య పింఛన్ ఇప్పించాలని ప్రాధేయపడుతున్నాను.

– శక్తివేలు, గిరింపేట, చిత్తూరు

ఇంటి స్థలం సర్వే చేసి చూపించాలి



గత ప్రభుత్వంలో 1.5 సెంట్లు ఇంటి స్థలం కేటాయించారు. పలు కారణాల వల్ల ఇంటి నిర్మాణం చేపట్టలేదు. ప్రస్తుతం తనకు కేటాయించిన ఇంటి స్థలం సర్వే చేయించి హద్దులు కేటాయించి న్యాయం చేయాలి. మండల అధికారుల దృష్టికి నా సమస్యను చెబితే వారు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. అందుకే కలెక్టర్ కార్యాలయానికి వచ్చి అర్జీ ఇచ్చాను.

– మునిరత్నం, గంగాధరనెల్లూరు మండలం

దివ్యాంగుల పింఛన్ ఇప్పించండి



నాకు రెండు చేతులు, రెండు కాళ్లు సహకరించడం లేదు. దివ్యాంగ పింఛన్ కోసం చాలా సార్లు అధికారులకు అర్జీ ఇచ్చాను. పూర్తి వైకల్యం ఉన్నందు వల్ల రూ.15 వేలు పింఛన్‌ను ఇప్పించి ఆదుకోవాలి. కలెక్టర్ సారు న్యాయం చేస్తారని వచ్చి వేడుకున్నాను. ఏమి జరుగుతుందో నిరీక్షించి చూడాలి.

– గోవిందరాజులు, తవణంపల్లె



నీళ్ల ట్యాంకు నిర్మించాలి

నాగర్లకంద్రిగ గ్రామంలో నీళ్ల ట్యాంక్ లేకపోవడం వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. మా గ్రామంలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉంది. నీళ్ల కొరత వాళ్ల డబ్బులిచ్చి బయట ప్రాంతం నుంచి ట్యాంకర్లు తెప్పించుకుంటున్నాం. అధికారులు స్పందించి మా గ్రామంలో నీటి ట్యాంక్‌ను నిర్మించాలి. సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలి.

–నాగర్లకంద్రిగ గ్రామస్తులు, గంగాధరనెల్లూరు మండలం

శివశివ శంకరా.. శంభో శంకరా!



మొగిలి శివాలయం ఆవరణలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కార్తీక సోమవారం కావడంతో చిత్తూరు నగరంలోని శివాలయాల్లో భక్తుల కోలాహలం నెలకొంది. ఈశ్వరగుడివీధిలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయం, ఇరువారంలోని నాగేశ్వరస్వామి ఆలయం, కట్టమంచిలోని కుళందీశ్వరస్వామి ఆలయం, గిరింపేటలోని చిదంబరేశ్వర స్వామి ఆలయాల్లో తెల్లవారుజామున నాలుగు గంటలకే స్వామి వారికి విశేష అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేసిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ఆవరణాల్లో భక్తిశ్రద్ధలతో దీపారాధన చేశారు.

కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన అనుబంధ ఆలయమైన మణికంఠేశ్వరస్వామి ఆలయంలో సోమవారం కార్తీక సోమవారం పూజలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం అభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించి అర్చనలు చేశారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆలయ ఆవరణలోని ఉసిరి, మారేడు చెట్టు కింద పిండి దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

మొగిలి శివాలయంలో కార్తీక పూజలు

బంగారుపాళెం: మండలంలో దక్షిణకాశిగా ప్రసిద్ధి చెందిన మొగిలి శివాలయంలో సోమవారం కార్తీక పూజలు ఘనంగా నిర్వహించారు. తెలుగు కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా ఉదయం శ్రీకామాక్షి సమేత మొగిలీశ్వరస్వామి వారికి అభిషేకాలు, పూజలు చేపట్టారు. అనంతరం ధూపదీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు సర్వదర్శనం కల్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు కార్తీక దీపాలు వెలిగించి శ్రీమొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మవారిని దర్శించుకున్నారు.

రాహుకేతు పూజలు

ఆలయం ఆవరణలో సోమవారం రాహుకేతు పూజలు నిర్వహించారు. రాహుకాల సమయం ఉదయం 7.30 నుంచి 9 గంటల మధ్య ప్రత్యేక పూజలు రాహు, కేతు, సర్పదోష నివారణ పూజలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి మునిరాజులు, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.